క్లుప్తంగా

ఉత్సాహంగా సిరిమానోత్సవం



వెలంపాలెం గోగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద సిరిమానోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన గోగులమ్మ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సిరిమానోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.

కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటుకు తీర్మానం

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయిలో పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు కాకతీయ కమ్మ సంఘం నాయకులు నిర్ణయించారు. మండల పరిధి వల్లూరులో సోమవారం కమ్మ సంఘం సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులకు ఆహారాన్ని సమకూర్చేందుకు కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్మ కమ్యూనిటీ కిచెన్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సంఘం నాయకులు, మాజీ రిటైర్డ్ ఇంజనీర్ గూడూరి సత్యనారాయణ మాట్లాడుతూ చదువుకున్న పిల్లలు దూరపు ప్రాంతాల్లో స్థిరపడటంతో గ్రామాల్లోని వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. వారి కోసం కమ్యూనిటీ కిచెన్ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మణికొండ కమ్మ సంఘం అధ్యక్షుడు కమ్మ బ్రహ్మాజీ చౌదరి, చావా వినయ్, శివశంకర్, రఘు, కపిలేశ్వరపురం మండల నాయకులు నెక్కంటి శ్రీరాంజీ, కళ్యాణ్, వెంకట్రావ్, రామారావు పాల్గొన్నారు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



విప్లవ వీరుల వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిద్ధూ

రామచంద్రపురం రూరల్: ఆసియా ఖండపు విప్లవ హీరోలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో యువత ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ పిలుపునిచ్చారు. మండలంలోని హసన్‌బాద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విప్లవ వీరుల 93వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన సభలో ఘనంగా నివాళి అర్పించారు. దేశంలో విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా విప్లవ వీరుల స్ఫూర్తితో పోరాడాలని విద్యార్థులు పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు ఎం. సతీష్, పి.సందీప్, కె.బాలు, కె.జగన్, ఎల్.అనిత తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో ఫాల్గుణ పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం ఫాల్గుణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుతగా విజయవేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చన, భవానీ శంకర సమేత అష్టమలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. హోలీ పర్వదినం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పీఠానికి వచ్చి పూజలు చేశారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, సేవా సమితి ప్రతినిధులు గాదె సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ, బి.రమ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



అయోధ్యరాముడు (ఫైల్)

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన అరవలవల్లి అయోధ్య రాముడు (23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన అయోధ్య రాముడు గ్రామంలోని తన అమ్మమ్మ గారింట వద్ద ఉంటూ ఉల్లిపాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరూ లేని సమయంలో ఇంట్లోని పడక గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ ఉన్నాడు. స్థానికుల సాయంతో అతడిని ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయోధ్య రాముడు ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. గ్రామంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రావులపాలెం సీఐ రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు ప్రాధాన్యం

- ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం
- 99,583 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు
- ఎకరాకు 50–55 బస్తాల దిగుబడి అంచనా
- కనీస మద్దతు ధర ప్రభుత్వ లక్ష్యం



కోతకు సిద్ధమైన వరి పైరు

రాయవరం: రబీ వరి పంట కోతకు సిద్ధమవుతోంది. అధిక శాతం రైతులు వరికోత యంత్రాలతోనే మాసూళ్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్ముకునే విధంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రైతులకు ధాన్యం కొనుగోలుపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. దిగుబడి అంచనా ఆధారంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

అనుకూలించిన వాతావరణం

రబీ ప్రారంభం నుంచి అన్నదాతకు వాతావరణం అనుకూలించిందనే చెప్పవచ్చు. సాధారణంగా రబీ చివర్లో దోమపోటు, వివిధ రకాల తెగుళ్ల వరి పంటను ఆశిస్తాయి. రబీ ప్రారంభం నుంచి తెగుళ్లు, పురుగుల ఉధృతి తక్కువగా ఉండడంతో రైతన్నలకు పురుగు మందులపై పెట్టే పెట్టుబడి గణనీయంగా తగ్గింది. క్లస్టర్ పరిధిలో సుమారుగా 90 శాతం మేర ఎంటీయూ 3626 (బొండాలు) రకాన్ని సాగు చేయగా, మిగిలిన 10 శాతం 1121 (శ్రీధృతి) రకాన్ని, ఆరెన్నార్ 34449 తదితర రకాలను సాగు చేశారు.

3.80 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 99,583 ఎకరాల్లో రబీ వరి సాగును రైతులు చేపట్టారు. ఎకరాకు 50–55 బస్తాల దిగుబడి వస్తుందన్నది వ్యవసాయ శాఖ అంచనా. దీని ప్రకారం క్లస్టర్ పరిధిలో 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. దిగుబడి మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసింది. క్లస్టర్ పరిధిలో ఉన్న 129 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ మద్దతు ధర ఇలా

ప్రభుత్వం సాధారణ ధాన్యం రకం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.1,637, ఏ గ్రేడు రకం ధాన్యం 75కేజీల బస్తా రూ.1,652గా మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది.

నాణ్యతా ప్రమాణాలు ఇవీ

మట్టి, రాళ్లు, ఇసుక వంటి వ్యర్థాలు, గడ్డి, చెత్త, తప్ప, కలుపు విత్తనాలు ఒక శాతం మించి ఉండరాదు. చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యపు గింజలు ఐదు శాతం మించకూడదు. పరిపక్వం కాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు మూడు శాతం లోపే ఉండాలి. తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు ఏ గ్రేడు రకంలో ఆరు శాతం మించకూడదు. తేమ లేక నిమ్ము 17శాతం మించకూడదు.

మండలం	ఆర్‌బీకే సెంటర్లు	వరి సాగు ఎకరాల్లో	దిగుబడి అంచనా (మె.ట)
రాయవరం	19	14,509	55,000
మండపేట	24	16,296	65,000
కపిలేశ్వరపురం	19	15,758	61,000
ఆర్‌సీపురం	21	18,120	69,000
కె.గంగవరం	23	15,444	58,000
కాజులూరు	23	19,456	72,000
మొత్తం	129	99,583	3,80,000

రైతులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యంతో కలపరాదు. పంట కోసిన తర్వాత ఆరబెట్టక పోతే గింజలు రంగుమారి నాణ్యత కోల్పోతాయి. పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకుని రావాలి. నూర్చేటప్పుడు ధాన్యంలో రాళ్లు, మట్టి గడ్డలు కలవకుండా నేల మీద బరకాలు, టార్పాలిన్లు వేసి వాటిపై నూర్పిడి చేయాలి. పంటలో తాలు, తప్ప, పొల్లు, చెత్తాచెదారం పోయేటట్లు తూర్పారబెట్టాలి. ధాన్యం ముక్కిపోయి, రంగుమారి నాణ్యత పడిపోకుండా తేమ తగ్గిన తర్వాతే బస్తాల్లో పట్టుబడి చేసి, లాటు కట్టాలి. నిల్వచేసే ధాన్యం బస్తాల్ని నేలపై కాకుండా చెక్క బల్లలపై నెట్టు కట్టాలి. తగిన జాగ్రత్తలు పాటించకుంటే మద్దతు కోల్పోయే అవకాశముంది.

నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు



రైతుకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతులు నష్టపోకుండా ప్రతి ధాన్యం గింజ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఆర్‌వీ కృష్ణారావు, తహసీల్దారు, రాయవరం

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు కనీస మద్దతు ధరపైన, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకే స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ఘనంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మండపేట: ద్వారపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆవరణలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దేవతామూర్తులను దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. శ్రీధర్ స్వామీజీ పూజలు చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్ళకూరి నాగబాబు తదితర ప్రముఖులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో నూలు వెంకట రమణమూర్తి, మాజీ అధ్యక్షుడు కాళ్ళకూరి గొల్లబాబు, జిల్లా నాయకులు కంచర్ల బాబి, భద్రరావు, కూసుమంచి పాపారావు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మండపేట పట్టణం 14వ వార్డులో శెట్టి బలిజ రామాలయంలో గణపతి మహాలక్ష్మీ సహిత హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, నూరంపూడి సత్యప్రసాద్, పట్టణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన శ్రేణులు



భారీ ర్యాలీతో తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, కార్యకర్తలు

రామచంద్రపురం రూరల్: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఆత్మీయ సమావేశం కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సోమవారం హసన్‌బాదలోని తమ ఇంటి వద్ద నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. దారి పొడవునా సూర్యప్రకాష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చేసి చూపించిన నేత జగన్

రామచంద్రపురం: రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో 50 శాతం పైగా ఎస్సీ, బీసీ మైనార్టీలకు సీట్లు ఇచ్చి సామాజిక న్యాయాన్ని చేసి చూపించిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ జెడ్పీటీసీ, పార్టీ నేత ఇంత సంతోషం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం స్థానిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా అయిదేళ్ల పాటు పరిపాలన సాగించి పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ పాటుపడ్డారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి తిరిగి ఎన్నికలకు వెళుతూ చేసిన మేలును గుర్తు చేస్తూ తనకు ఓటు వేయాలని అడుగుతున్న గొప్ప నేత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని సంతోషం అన్నారు. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో పేదరికి తగ్గిందనే సంగతిని ప్రతిపక్షాలు పెడచెవిన పెడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయన్నారు. నమ్మశక్యంగా లేని హామీలను ఎన్నికల సమయంలో ఇస్తు ఓట్ల కోసం ప్రజల వద్దకు వస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు అమలుతో ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాన్ని నెట్టేస్తున్నారని గతంలో విమర్శించిన టీడీపీ–జనసేన నాయకులు మరి ఎన్నికల్లో అమలు చేయలేని హామీలను ఎందుకు ఇస్తున్నారని సంతోషం ప్రశ్నించారు. కేవలం మరోసారి ప్రజలకు మోసం చేసేందుకు మాత్రమే మేనిఫెస్టోలను రూపొందించిన ఎన్నికల అనంతరం వాటిని బుట్టదాఖలు చేస్తున్నారని సంతోషం విమర్శించారు. ఈ రాష్ట్రంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



టేకిలో విజేతలతో నిర్వాహకులు

కపిలేశ్వరపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐఎం ఆధ్వర్యంలో టేకిలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఐ లవ్ అంబేడ్కర్ పేరుతో సోమవారం 133వ జయంతి కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించగా ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరంలోని గైట్ ఫార్మసీ స్కూల్ ఆఫీసర్ షేక్ మీరా హాజరయ్యారు. ప్రతిభా పోటీలను మోడ్రన్ స్కూల్, గైట్ ఫార్మసీ స్కూల్ అధ్యాపకులు ఎస్ సూర్యప్రతాప్, ఎం.చిన్నిబాబు పర్యవేక్షించారు. పలువురు ప్రముఖులు హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దండంగి చిన్నబాబు, సాదే కిశోర్ కుమార్, పెట్టా సతీష్, ఎస్. పవన్ కుమార్, పాలింగి శ్రీను, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా వ్రతాలు


రాయవరం: పసలపూడిలో సాయిబాబా సామూహిక వ్రతాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆలయం 30వ వార్షికోత్సవంలో భాగంగా కొవ్వూరి రామకృష్ణారెడ్డి, సత్తిరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సాయిబాబా వ్రతాలు నిర్వహించారు. పసలపూడి పరిసర గ్రామాలకు చెందిన 200 మంది మహిళలు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆంజనేయులు, సూర్యప్రకాష్ అర్చకత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కర్రి దేవారెడ్డి, కర్రి గంగిరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తేతలి గోవిందరెడ్డి, కర్రి నారాయణరెడ్డి, కర్రి కృష్ణారెడ్డి, పోతంశెట్టి రమణ పాల్గొన్నారు.



పసలపూడి సాయిబాబా ఆలయం వద్ద వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఇప్పనపాడులో ఎమ్మెల్సీ తోట పర్యటన



ఇప్పనపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని విధాలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ఇప్పనపాడులో సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కురుపూడి రాంబాబు, ఎంపీటీసీ వనుం సత్యవేణి తదితర నాయకులతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. ఎమ్మెల్సీ తోటకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని ఎమ్మెల్సీ తోట, మండల, గ్రామ నాయకులు వివరించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి ప్రజల ముందుంచారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధి పొందేందుకు జన్మభూమి కమిటీలు, మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాల లబ్ధిని ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారని అన్నారు. ద్వారపూడి–మండపేట ప్రధాన రహదారితో పాటు గ్రామాల్లో అనేక సీసీ రహదారులు, డ్రెయినేజీలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. కుట్రలను వ్యతిరేకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరిగ ఆశీర్వాదం, పెదపాటి సత్యనారాయణమూర్తి, మట్టపర్తి గోవిందరాజులు, గారపాటి అశోక్ కుమార్, అన్నందేవుల కృష్ణారావు, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వల్లూరి రామకృష్ణ, గొలుగూరి సందీప్‌రెడ్డి, తోరం శ్రీనివాస్, దేవు ప్రసాద్‌నాయుడు, పిల్లా సూరిబాబు, ఈదర వీరాస్వామి, వరదా చక్రవర్తి, త్రిశూల శ్రీను, చిన్ని గంగాధరం, త్రిశూల అప్పారావు, చింతలపూడి మల్లిబాబు, వనుం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు: వేసవి తీవ్రత నేపథ్యంలో గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. సోమవారం గ్రామంలో క్లబ్ సభ్యులు వేసవిలో తీసుకోవలసిన ఆరోగ్య నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించి స్థానికులకు పలు సూచనలు చేశారు. విధిగా కాటన్ దుస్తులనే ధరించాలని, ఆహారంగా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు గుర్తించే లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వి.గణపతి, కె.గణేశ్‌కుమార్, ఎస్.భువనేశ్వరి, విజయలక్ష్మి, దుర్గారాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామానికి చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన నున్న సూరిబాబు, తాడాల దుర్గారావు, సలాది సతీష్, సలాది రాంబాబుతో పాటు వారి వర్గానికి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎంగా జగన్ మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులమై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌ని చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాపు సామాజికవర్గానికి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పిల్లి సూర్యపకాష్ తదితరులు

ఘనంగా హోలీ పండగ



కాజులూరులో హోలీ సందర్భంగా రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

కాజులూరు: హోలీ పండుగ కార్యక్రమాలను సోమవారం కాజులూరు మండల గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా అంతా ఒక చోట చేరి హోలీ ఆడారు. పలు ప్రధాన కూడళ్లలో మహిళలు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

ఆనందాల హోలీ

రాయవరం: హోలీ సంబరాలు సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ మిత్రుల ఇళ్లకు వెళ్లి రంగులు చల్లుతూ హంగామా చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



రాయవరంలో హోలీ సంబరాల్లో చిన్నారుల సందడి